# గగనానికి ఇలకు బహుదూరం

నిద్ర పట్టకపోవడం జబ్బు.

అయితే, ఇదో తరహా.

పక్కమీదకు చేరగానే చక్కగా నిద్రకు జారుకుంటాడు.

ఎవరో కొట్టి లేపినట్లుగా సరిగ్గా మూడు గంటలకు మెలకువ వచ్చేస్తుంది. తిరిగి గడియారం నాలుగు గంటలు చూపించేంత వరకు ఏం చేసినా నిద్ర పట్టడం ఉండదు. తల్లక్రిందులుగా తపస్సు చేసినా సరే.

హిందువుల లెక్కలో బ్రహ్మముహూర్తం మూడు గంటలకు. అది యోగులకు, తపస్సు చేసుకునే వాళ్ళకుగాని, తనలాగా పూర్తిగా ప్రభుత్వ అధీనంలో ఉన్న కంపెనీలో ట్రాక్టర్లు వగైరా అమ్ముకునే వాడికేమిటి ?

జయవర్ధనం సమస్య ఇదీ.

ఇంట్లో అయినా సరే, బయట సంచారంలో ఉన్నప్పుడైనా సరే, మూడు గంటలు అవడంతోటే నిక్కచ్చిగా మంచం మీద లేచి కూర్చోవలసిందే.

బొత్తిగా నిద్ర పట్టదు. ఆ గంటసేపూ, ఎంత జటిలంగా ఉన్న పుస్తకం చదువుతూ ఉన్నా సరే. అదీ విచిత్రం.

ఈ గంటసేపు ఎలా గడపాలి - అన్నది సమస్య.

సొంత విషయాలను గురించి ఆలోచిస్తే, జీవితం చుట్టూ వలయాలుగా తిరుగు తున్న - పరచుకున్న - సమస్యలు మరింతగా పెరిగిపోయి దట్టంగా కమ్ముకుంటాయి.

ఆసక్తికరంగా ఉన్న పుస్తకాలు చదవడం ఇష్టం లేదు.

ఎందుకంటే, ఆ గంట గడిచిపోవడం తోటే ... సరిగ్గా నాలుగు గంటలకు కథ మధ్యలోనే ఉండిపోయి నిద్ర పట్టిపోతే... పాత్రలు, వాటి సన్నివేశాలు అవన్నీ ఏమయి పోవాలి ?

వావిళ్ళ వారి నిఘంటువు నాలుగు వాల్యూములూ సంపాదించాడు ఆమధ్య. వాటి పేజీలు తిప్పుతూ కొత్త కొత్త మాటలు నేర్చుకోవడం మొదలుపెట్టాడు.

ఇదీ అంత తేలిక అయిన పని కాలేదు.

పుస్తకాలు బహు బరువు. గుండెల మీద అచ్చులు పడిపోతాయి. అట్టల చివరలు. మంచి మాట కనిపించినప్పుడు ప్రత్యేకంగా కాగితం మీద రాసుకోవాలనిపిస్తుంది. ఇలా 'నోట్' చేసుకుంటూ పోయిన కాగితాల దొంతరలు బల్లమీద పేరుకుపోతున్నాయి. పారవేయటానికి లేదు. ఇంకేం చేయటానికీ తోచదు.

పై ఊళ్ళలో ఉన్నప్పుడు ఈ సమస్య మరీ బాధాకరం.

హోటలు గదిలో 'ఫోం' పరుపు మధ్య గుండ్రాయిలా కూర్చుండి పోయి ఏం చేయాలి ?

పడకకు పక్కనే చిన్న బల్లమీద టెలిఫోన్ ఇన్‌స్ట్రుమెంట్ ఉంటుంది. హోటల్ గదుల్లో, దాని పక్కన డైరక్టరీ తప్పని సరి.

డైరెక్టరీలు, నిఘంటువులతో పోటీ పడేంత లావు, చిన్న చిన్న అక్షరాలు.

చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం అవునో కాదో గాని, చిన్న అక్షరాలు మాత్రం కళ్ళకు ఆయాసం, నరాల బరువు తీసుకువస్తాయి.

అయినా ఆ డైరెక్టరీలు చదవడం తమాషాగా ఉంటుంది. ఏ అక్షరంలో ఎక్కువ పేర్లు ఉన్నాయి ? ఏ భగవంతుడి పేరు ఎక్కువమంది మనుషులు పెట్టుకున్నారు ? ఓ పేజీలో ఓ కాలమ్ గూడా నిండని పేర్లు ఉన్న అక్షరం ఏది ? ఈ అక్షరంతో మొదలయే పేర్లు తనకు తెలిసినవి ఇంకేమయినా ఉన్నాయా ? ఒకే ఇంటి పేరు ఉన్న వాళ్ళు వేరు వేరు అడ్రసులలో ఉన్నా ఒకే నంబర్ ఇంకొకళ్ళకు కలిపివేయటానికి వీలున్నదా ? 'కాల్' చేయదలుచుకున్న వాళ్ళ ఇబ్బందులు ఎలా ఉంటాయి ?

సమయం సరిగ్గా 3.14 అయింది.

పెద్ద హోటలు గది. మహారాజాయో ఏమిటో దీని పేరు. అయిదు నక్షత్రాల హోటలు. పరుపు చప్పుడు చేయకుండా అణగి మణగి కదులుతోంది, జయవర్ధనం కదలికలకు అనుగుణంగా.

అతను చేయి జాపి డైరెక్టరీ అందుకున్నాడు.

భగవంతుని మీద భారం వేసి గుడ్డిగా ... అంటే, కళ్ళు మూసుకుని... ఓ పేజీ యాథాలాపంగా తెరిచాడు.

'నరసింహం' పేరు.

రావు, రెడ్డి అయిపోయి 'నరసింహులు' వచ్చింది.

నరసింహులు తర్వాత మళ్ళీ రావు, రెడ్డి... ఇంకొంత దూరం పోయాక సెట్టి... షెట్టి... ఇలా.

ఇదీ దేవుడి పేరే, రాముడు - కృష్ణుడు - అంత పరిపాటి కాకపోయినా

రేపు ఉదయం తన దగ్గరకు రావలసిన మనిషిపేరు 'నరసులు' అయితే, అతని పేరు టెలిఫోన్ డైరెక్టరీలో ఉండదు. ఫోన్ కంపెనీ పేరు మీద ఉంటుంది. ఆ కంపెనీ పేరు జయవర్ధనం ఎరుగును. ఫోన్ నెంబరు కూడా కంఠోపాఠమే. ఈ ప్రయాణం ఫలితం అంతా ఆ నంబర్ మీదనే ఆధారపడి ఉంది. నిజానికి... ఇదంతా తెలిసినా అతను ఎందుకయినా మంచిదని నరసులు పేరు వెదికాడు డైరెక్టరీలో. దొరికింది. అయితే, తనకు కావలసిన డి. యస్. నరసులు కాదు. టి. ఆర్. నరసులు, ఆర్. అంటే ఏమిటి : 'రామ' అయి ఉంటుందా ? టీ ? ... తల్లావఝుల, తాడికొండ, తాఝూరి, టేకుమళ్ళ ... ఏదయినా కావచ్చును. ఏమయితే తనకేం గనుక ? ఈ రామనరసులతో తనకు పనిలేదు..

పోనీ టెలిఫోన్ చేస్తే ?

3: 30 కు టెలిఫోన్ చేసి, తీరా అతడు పలికిన తర్వాత, 'సారీ, సర్, రాంగ్ నంబర్, అయినా, మీ ఇంటి పేరు ఏమిటండీ' అంటే ఎలా ఉంటుంది ?

అతను చూహా కనుక్కుని మరునాడు వచ్చి తనను 'కీల్‌పాక్' ఆస్పత్రికి చేరుస్తానంటే మా గతి ? రక్షించటానికి ఎవరిని పట్టుకోవాలి ? - ఈ ఉదంతం అంతా పొద్దున్న డి. యస్. నరసులు న్యూస్‌పేపర్లలో చదివి తెలుసుకుని, ఈ పిచ్చివాడి దగ్గర నేను ట్రాక్టర్లు కొననుగాక కొనను అని ఏదో 'నెపం' చెబితే, ఈ ఉద్యోగం కాస్తా ఏమయి పోతుంది ? మార్చి నెల ఇంకా రెండు నెలల్లో ముగుస్తుంది. అమ్మకాలలో సాధించ వలసిన 'అంకె' ఇంకా చాలానే ఉంది. మార్చి ముప్పయ్యో తేదీన 'పర్చేజ్ ఆర్డర్లు' కలెక్టు కాకపోతే, వచ్చే సంవత్సరం ఈ ఉద్యోగం ఉంటుందని 'నమ్మకం' లేదు. శాశ్వతమైన సంస్థలో అతి అశాశ్వమైన పెద్ద ఉద్యోగం !

అయినా, ఉద్యోగాన్ని గురించి ఆలోచన ఎందుకు ఇప్పుడు ? అంతా సవ్యంగా

జరిగిపోతోందిగా, కడుపు బాగా నిండిపోతోంది. కాలికి బోలెడంత పని. కరువు, దరిద్రం జోలికి రాకుండా దూరంగా ఉండిపోతున్నాయి.

డైరెక్టరీ మూసి పక్కన పెట్టాడు ఒక్క క్షణం.

రెండు కళ్ళూ మూసుకున్నాడు.

ఎడమ కన్ను తెరిచాడు ముందు. ఎదురుగా అజంతా శిల్పంలో ఏనుగుల బొమ్మ కనిపించింది.

ఏనుగు జ్ఞానానికి ప్రతీక.

కుడి కన్ను కూడా తెరిచాడు.

మళ్ళీ డైరెక్టరీ పేజీలు తిప్పాడు.

ఈమారు మరీ చివర కాకుండా మొదటి పేజీలలోనే ఒకచోట తెరిచాడు. ప్రయత్నం చేసి.

క.

వరుసగా పేర్లు చదువుతూ పోయాడు.

'కర్పూరలతిక!' దగ్గర ఆగిపోయింది చూపు, వేలు. చాలా పరిచయం ఉన్న.పేరు.

ఎవరు ? - తన స్నేహితురాలు కర్పూరలతిక కాదు గదా. ఇంకా ఎక్కడి లతిక ?

ఇరవై అయిదేళ్ళ కిందటనే తీవ్రమైన రోగంతో మూడు నెలలు ఆస్పత్రిలో తీసుకు తీసుకు పోయింది గదా ! ఇంగ్లీషు లెక్కల ప్రకారం అయితే ఇది వర్ధంతికి సిల్వర్ జూబిలీ సంవత్సరం.

దహన సంస్కారానికి వెళ్ళడం జయవర్ధనానికి గుర్తు వచ్చింది.

... బి. ఎలో జయవర్ధనం, కర్పూరలతిక క్లాస్‌మేట్స్.

చాలా దగ్గరకు వచ్చారు.

ఒంటరిగా అనేకమార్లు ప్రయాణాలు చేశారు, ప్రణయాలు నెరిపారు. పెళ్లి అయేదేమో వాళ్ళకు ఇంకా కొన్నాళ్ళు పోతే.

కర్పూరలతికకు జబ్బు.

ఏం జబ్బో డాక్టర్లూ ఎన్నాళ్ళకూ చెప్పలేదు. వివరించలేదు. కానీ,వైద్యం చేస్తూనే ఉన్నారు, విడవకుండా.

రోజూ - సాయంత్రం జయవర్ధనం వెళ్ళి చూచి వస్తూనే ఉన్నాడు.

అతన్ని చూడగానే లతిక ఉల్లాసంగా నవ్వేది.

నవ్వినప్పుడే బుగ్గలు ఉబ్బేవి. పెదాలు పరుచుకునేవి.

ఎన్నోమార్లు ముద్దు పెట్టుకున్న పెదాలు, పరిచయం పెంచుకున్న తీపిని, తృప్తిని అందజేసిన పెదాలు.

కర్పూరలతిక జ్ఞాపకాల నుంచి తప్పించుకోలేక అయిదారేళ్ళు పెళ్ళి కూడా చేసుకోలేదు. బంధువులు, స్నేహితులు చెడ తిట్టేంతవరకు మామూలు మనుషుల్లో పడలేదు. అంతా అయిపోయి - ఇరవై అయిదు సంవత్సరాలు గడిచిపోయింది.

ఇంకా ఎక్కడి కర్పూరలతిక !

అయినా, ఇక్కడ ఎందుకు ఉంటుంది ? ....

ఆశగా, ఆత్రంగా అడ్రస్ వంక చూచాడు. ఈ హోటలు బ్లాక్‌కు పది నిమిషాల కారు - దూరంలో ఉంది. నడిచి వెడితే అరగంట పట్టవచ్చు - కాకపోతే నలభై నిమిషాలు. రేపు ఉదయం ఆఫీసు కారు రావడంతోటే ముందు అక్కడకు వెళ్ళి ఆ కర్పూరలతికను కలుసుకోవాలి.

ఇన్ని సంవత్సరాల తరువాత కలుసుకుంటున్నప్పుడు ... ఇప్పుడు మళ్ళీ గుర్తు పట్టగలుగుతుందా ? మారిపోయి ఉంటుందా బాగా ? మారిపోవడం సహజం కదూ?

ప్రపంచంలోకల్లా శాశ్వతమైనది ఏమిటి ? అంటే 'మార్పు' అని చెప్పుకోక తప్పదు గదూ.

గడియారం చూచుకుంటే - నాలుగు గంటలు అవటానికి ఇంకా మూడే మూడు నిమిషాలు ఉంది.

మరో మూడు నిమిషాలలో నిద్ర ముంచుకు వస్తుంది. ఒళ్ళు తెలియకుండా నిద్రపోతాడు.

నిద్రపోయి లేచిన తర్వాత కర్పూరలతిక గుర్తుకు రాకపోవచ్చు కూడా.

పోవచ్చును ఏమిటి ? రాదు. ప్రయత్నం చేయాలన్న ఆలోచన కూడా మనసు పొలిమేరలకు రాదు.

'సిల్వర్ జూబిలీ ఇయర్'లో మహదను గ్రహంతో డైరెక్టరీ పుటలలో కనిపించి,

పునర్దర్శనం ఇవ్వపూనుకున్న కర్పూరలతికను మరచి పోవడం మంచిదనా ? ఈ రోజు మరచిపోతే, మళ్ళీ జీవితంలోకి రాకపోవచ్చును, అందకుండా అదృశ్యం అయి పోవచ్చును.

అసలే అభిమానం ఎక్కువ ఆ మనిషికి, ఏమయినా సరే... నిద్రపోవటానికి వీల్లేదు. కర్పూరలతికను కలుసుకుతీరాల్సిందే !

ఎలా ఉందో !

పెళ్ళి, పేరంటం అయి, పిల్ల, పాపలతో, మనుమడికో, మనుమరాలికో జోలపాట పాడుతూ కనిపించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. కాలం అలాంటి పరిణామాలను అతి అవలీలగా తీసుకురావడం వల్లనే ప్రపంచంలో జనాభా సమస్య ఇంత తీవ్రమై కూర్చుని ప్రళయాలు తీసుకువస్తోంది.

జయవర్ధనం మనుమళ్ళను గుర్తుచేసుకున్నాడు.

కూతురు కొడుకు ఎర్రగా బొద్దుగా ఒక నెల చొక్కాలు రెండో నెలకు పనికి రాకుండా ఎదుగుతున్నాడు.

మంచం మీద నుంచి దూకినట్లుగా కిందకు దిగాడు.

పై దుస్తులు విదిలించి, 'రేక్' మీద పడవేసి బాత్‌రూంలోనికి వెళ్ళి షవర్ కింద నిలుచున్నాడు.

చల్లగా నీళ్ళు తలను తడిపివేస్తున్నాయి.

భుజాలు బరువుగా కదులుతున్నాయి.

చాలాసేపు అయిన తర్వాత ఇవతలకు రాగలిగాడు.

ఒళ్ళంతా శుభ్రంగా తుడుచుకుని, సూట్‌కేస్‌లోని మరో జత బట్టలు వెదికి తీసుకుని మరీ వేసుకున్నాడు.

గోధుమ రంగు చొక్కా

సముద్ర నీలం రంగు పాంటు, ఈ రెండు రంగులకు ఎలా సమన్వయమో మనసుకు అతుక్కుపోయింది.

యథాప్రకారం 'టక్' చేసుకున్నాడు. 'టై' మాత్రం చేసుకోలేదు.

కర్పూరలతికకు ఆ దుస్తులు ఇష్టమేనా ? అప్పుడు కూడా తను ఇలాంటి దుస్తులే

వేసుకునేవాడా ? లేక మరో రకమా ? ఆమె ఏ రంగులు ఇష్టపడేదో గుర్తు రావేడు.

ఆమె ఎలాంటి చీరలు కట్టేది ?

చీరలేనా ? ఫ్రాక్ వేసుకునేదా ?

జీన్స్ ఫాంట్ వేసుకునేదా ? చూడీదార్ - దుపట్టా ధరించేదా ?

జయవర్ధనంకు ఏ ప్రశ్నకూ జవాబు చప్పున స్ఫురించలేదు.

ఏమో ! ఏమో !

ఆస్పత్రి మంచం - నిర్వీరామంగా పడుకుని ఉన్న కర్పూరలతిక.

ఎవరేనా చూడవచ్చినప్పుడు లేచి కూర్చోవటానికి ప్రయత్నించడం, వాళ్ళు, 'లేవ వద్దు - పడుకునే ఉండు' అని వారించడం ... అయినా, ఆమె కొద్దిపాటిగా ముందుకు జరగడం... ఇదంతా గుర్తుకు వచ్చింది. కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తోంది. మనో నేత్రం చూపించే బొమ్మలు బుద్ధిని బండబారుస్తున్నాయి.

కర్పూరలతికను చూడటానికి వెడుతున్నాను. ఏం తీసుకువెళ్ళాలి ?

ఇంకా దుకాణాలు తెరవరు.

కంపెనీ కాంప్లిమెంటరీగా ఇస్తున్న సిగరెట్ లైటర్లు, షోల్డరు బ్యాగ్‌లో ఉన్నాయి. అది ఇస్తే ఏం బాగుంటుంది?

గడియారం వంక చూశాడు.

అయిదుకు ఇంకా పదినిమిషాలు ఉంది.

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు.

ఎవరేనా చూస్తే 'తెల్లవారుజామున వాకింగ్'కు వెడుతున్నాడు అనుకుంటారు.

కారు లేదు. నడిచే వెళ్ళాలి.

కర్పూరలతిక అడ్రెస్ మరోమారు డైరెక్టరీలో చూచుకున్నాడు. కాగితం మీద రాసుకున్నాడు.

బయలుదేరాడు. ఎందుకైనా మంచిదని ఒక 'లైటర్' హిప్ పాకెట్‌లో ప్యాక్ చేసిన కార్డన్‌తో సహా పెట్టుకున్నాడు.

తలుపు తీయడం తోటే 'రూం బాయ్' తూలుతూ 'నమస్కారం, సర్' టీ తెచ్చేదా' అన్నాడు.

తల అడ్డంగా ఊపాడు 'వద్దు' అంటూనే.

'అచ్ఛా సాబ్' అన్నాడు రూం బాయ్.

గేటు బయట గూర్ఖా సలాం చేశాడు. 'శుభోదయం, సర్!' అన్నాడు.

కర్పూరలతికను చూడబోతూ ఉంటే, శుభోదయం కాకపోవడం ఏమిటి?

బయటనే చేయవచ్చు బ్రేక్‌ఫాస్ట్; ఏడుగంటలు అయినాక.

భోగలాలసత.

బరువైన బాధ్యతలు.

బాదరబందీ లేని జీవితం.

అంతా కలగాపులగం అయిపోయిన బతుకు. ఏది పులుపో, కారమో, తీపో - ఇదమిత్థంగా తెలియదు.

కాగితం మీద రాసుకున్న అడ్రెస్ వైపుగా నడుస్తున్నాడు.

ఆకాశంలో తెల్లదనం వస్తోంది.

గాలిలో క్రమక్రమంగా మార్పు తెలుస్తోంది. మరెంత ?

ఇంకో పది నిమిషాలలో కర్పూరలతిక ఇంటి దగ్గర ఉంటాడు.

అయినా, ఇంత పెందరాళే వెడుతూ ఉన్నప్పుడు టెలిఫోన్ చేసి, కనుక్కుని - తనకు కావలసిన మనిషో కాదో విచారించి మరీ వెడితే మంచిది కదూ ! హోటల్ రూం నుంచే చేసి ఉండవలసింది. ఇప్పుడు ఎలా ? నాలుగు అడుగుల దూరంలో పి.సి.ఒ. కనిపించింది.

తన అదృష్టం - 'నక్కను తొక్కి వచ్చావు' అనుకునేవాళ్ళు చిన్నప్పుడు ఇంత యాదృచ్ఛికంగా అన్నీ కలిసి వస్తే.

అవును. నక్కను తొక్కే వచ్చాడు. లేకపోతే ట్రాక్టర్లు ఇలా విరివిగా ఎందుకు అమ్ముడయిపోతాయి ? కొత్త ఉత్సాహం ఎలా ముంచివేస్తుంది ?

చకచక ఏడు నంబర్లూ తిప్పాడు.

అవతల నుంచి 'రింగ్' వస్తోంది.

ఎవరో వచ్చి మరో క్షణంలోనో, రెండు క్షణాలలోనో రిసీవర్ అందుకుంటారు. సందేహం లేదు.

తీరా తనకు కావలసిన కర్పూరలతిక కాకపోతే నిరాశ అయిపోతుంది.

అయిదు నిమిషాలలో ఆ మనిషి ముందే ఉంటాడు. ఇంతలో టెలిఫోన్ కాల్ ఎందుకు ? విచారణలు - వివరణలు దేనికి ?

తెల్లవారుజాము... వాతావరణం బాగా ఉంది.

చల్లదనం, తాజాతనం.

రోడ్లన్నీ అప్పుడే ఊడ్చినట్లు శుభ్రంగా ఉన్నాయి.

అందమైన భవంతులు, ఆవరణలు.

చక్కగా ఏర్పాటు చేసుకున్న రోడ్లు ఇళ్ళూను.

'నేననుకుంటున్న కర్పూరలతికయే మీరు అయితే - ఓ పాతిక ఏళ్ళ కిందట చనిపోయి ఉంటారు. మీరు ఆ మనిషి కాకపోతే నాకు కావలసిన మనిషి కాదు' ఎంత అసంబద్ధమైన మాట. పొద్దున్నే పిచ్చి ఆస్పత్రి నుంచి తప్పించుకు వచ్చినవాడు తప్ప ఇంకెవరూ ఇలా మాట్లాడలేరు.

జయవర్ధనం ముందుకు నడిచాడు.

ఇందాకటి కంటే అడుగులు కాస్త వేగంగా వేస్తున్నాడు.

అంతా అనుకున్నట్లే జరుగుతోంది.

అదే చిరునామా, అదే ఇల్లు. ఇంటి ముందు ఆవరణ.

ఆవరణలో తోట. ఇంటికి కుడిపక్కగా పెద్ద ఖాళీ జాగా, తోటలో పూల మొక్కలు, పరిమళాలు, మొక్కల మధ్యగా నిడుపాటి దారి. ఇంటి ముందే నించున్నా తోటంతా ఓ మహత్తర దృశ్యంలా కళ్ళ ముందు సాక్షాత్కరిస్తోంది. దేవలోకంలో ఉద్యానవనం కాదు ఇది. కర్పూరలతిక ఇంటి ఆవరణలోని తోట !

తోటలో కాలి బాట మీదుగా నింపాదిగా నడుచుకుంటూ వస్తూంది కర్పూరలతిక.

జయవర్ధనం నిదానంగా నిలిచి చూచాడు.

అదే మనిషి. అదే శరీరం. అదే వాలకం.

తప్పు - పొరపాటు - భ్రమ అనుకుందుకు ఏమాత్రం అవకాశం లేదు.

కర్పూరలతికకు కవలసోదరి - అలాంటి సోదరి ఉన్నదన్న సమాచారం

దశాబ్దాలుగా దాచి ఉంచారన్నమాట.

అబ్బే అలా అవటానికి వీలు లేదు.

బొత్తిగా జానపద కథల్లోనే అలా జరుగుతుంది.

నిజమైన జీవితంలో కాదు.

గుండ్రటి మనిషి.

వయసుకు తగిన శరీరం.

గులాబీల లాంటి బుగ్గలు.

మరకతంలా మెరుస్తోంది.

బంగారం రంగు చీర.

బరువుగా మెడలో చంద్రహారం. కర్పూరలతిక అవటానికి ఏమీ సందేహం లేదు. ఆమెను ఎరిగి ఉండకపోతే తప్ప.

జయవర్ధనాన్ని దూరం నుంచే చూచి - గుర్తించినట్లుగా - నవ్వింది కూడా.

గేటు తీసుకు బయటకు వచ్చింది.

ఆమె కూడా ఈ ఉదయం షికారుకే బయలుదేరినట్లుంది.

జయవర్ధనం పక్కనుంచి వెడుతున్నప్పుడు ఆప్యాయంగా చూచి నవ్వింది. అపురూపంగా కళ్ళు చమత్కరించింది. నిజమా ? ఎంత ఆశ్చర్యం ! - అంటున్నాయి ఆ కళ్ళు.

ఆమెకు ఆహ్లాదంగా చేయి ఊపి, చేతయినంత చక్కగా నవ్వాడు.

ఆమె కూడా బదులు నవ్వింది మళ్ళీ. రోడ్డు ఓరగా నడుస్తూ ముందుకు వెళ్ళి పోయింది.

ఇదేదో కథ !

మొదలో చివరో తెలియని కథ !

హోటలు రూంకు వెళ్ళిపోవడం కోసం వెనక్కు తిరగాడు జయవర్ధనం. ఏదయినా టాక్సీ - ఆటో రిక్షా దొరికితే బాగుండును.

వెనుక నుంచి ఎవరో పిలుస్తున్నారు.

వెడుక్కుంటూ వచ్చిన ఆ ఇంట్లోంచే ఆ పిలుపు వస్తోంది.

'వెళ్ళిపోతున్నారేం ? రండి' అంటున్నాడు ఆ ఇంటి ఆవరణలోనే తిరుగాడుతున్న ఆసామీ.

జయవర్ధనం తప్పించుకుందుకు వీలు లేదు.

- ఎక్కడ ఉంటున్నారు ఇప్పుడు ?

- ఎప్పుడు వచ్చారు ?

- మా అడ్రెస్ ఎలా దొరికింది ?

- టీ తీసుకుంటారా ?

- ప్రశ్నలు కురిపిస్తున్నారు ఆయన, తాపీగా తనను తోటలోనే కుర్చీలో కూలవేసి.

ఏం సమాధానం చెప్పాలో స్ఫురించలేదు జయవర్ధనానికి.

ఇదంతా కలలా కరిగిపోయి, హోటల్ గదిలోనే పడుకుని ఉన్నట్లు దృశ్యం మారిపోతే బావుండునని అనిపిస్తోంది.

ఇంతకూ మీరు ఎక్కడికి వచ్చారో మీకు అర్థమయినట్లు లేదు.

అయోమయంగా చూడడం తప్ప ఇంకేం చేయలేకపోతున్నాడు. కర్పూరలతికకు పెద్దన్నను నేను.

ఇందాక మీకు ఎదురువచ్చిన అమ్మాయి ఎవరనుకుంటున్నారు ?

నా కుమార్తె, మా చెల్లాయి పోయిన సంవత్సరానికి పుట్టింది. అందుకనే చెల్లెలి పేరే పెట్టుకున్నాం.

అచ్చం మేనత్త పోలికగా ఉంది కదూ...!

-జయవర్ధనం గతంలోనికి కూరుకుపోయి అతన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. నోట మాట రావడం కష్టం అయిపోయింది.

మనసు ఆలోచనలను అదుముకు తమాయించుకోలేకపోతోంది.

సంగతులన్నీ బలవంతంగా పొడిపొడిగా చెప్పాడు.

''పోనీలెండి, మీరయినా జీవితంలో చక్కగా సెటిల్ అయిపోయారు. చాలా సంతోషం' అన్నాడు ఆయన, ఆమెకు పెద్దన్న.

మళ్ళీ ఆయనే అన్నాడు

'అమ్మాయి ఎం. బి. ఎ. చేసింది. మా కంపెనీ వ్యవహారాలే చూస్తోంది. ఉద్యోగాల

కోసం వెళ్ళాల్సిన అవసరం లేదు గదా...'

లేదు.. లేదు.. జయవర్ధనం మనసులోనే.

న్యూస్‌పేపర్ బాయ్ గేటు తెరుచుకు వచ్చాడు.

నాలుగు రకాల పేపర్లు అందించాడు.

నమస్కారం చేసి వెనక్కువెళ్ళి సైకిల్ ఎక్కి తుర్రుమన్నాడు.

'పేపర్ చూడండి' - ఒకటి అందించాడు ఆయన.

జవర్ధనానికి లోకంలోకి రావడం ఇష్టం లేదు.

భూకంపాలు, దుఃఖాలు, దౌర్జన్యాలు... చూడటానికేగా ఈ పేపర్లు.

'వద్దులెండి. సెలవు పుచ్చుకుంటాను' అని లేచాడు.

'టీ తీసుకోకుండానే' అని వారించాడు ఆయన.

ఆ మాటతోపాటే లోపల్నుంచి ఓ నౌకరు కుర్రాడు ట్రేలో రెండు కప్పులు టీ తీసుకువచ్చి ఇద్దరికీ చేతులకే అందించాడు.

పొగలు కక్కుతున్న టీకప్పులు.

పగలు ఆకాశాన్ని ఆక్రమించుకోవడం పూర్తిచేసి, కిందకు దిగివచ్చి భూమిని ఆవరించుకుంటూంది.

'మధ్యాహ్నం భోజనానికి రండి'

'వద్దండీ. ఆఫీసు పనిలోనే కూరుకుపోతాను. ఈమారు వచ్చినప్పుడు వస్తాను లెండి. థాంక్స్. క్షమించండి'.

- కేవలం బిజినెస్ జవాబు ఇచ్చేశాడు.

'అలా అంటే కుదరదు. పోనీ డిన్నర్‌కయినా రండి... ఎన్నేళ్ళు అయిందో మిమ్మల్ని చూచి. ఎన్ని గుర్తులు కదులుతున్నాయి మిమ్మల్ని చూడడంతోటే!...' అంటున్నాడు ఆయన.

గుర్తులు తెలియకుండా మారిపోతున్న ప్రపంచంలో మళ్ళీ వాటిని పట్టుకోవడం ఇష్టంలేదు జయవర్ధనానికి.

'కుదరదేమోనండి. బిజినెస్ డిన్నర్ ఉంటుంది!'

'పోనీ - ఇవాళ కాకపోతే రేపు మా ఇంట్లో భోజనం చేయకుండా ఊరు వదలి

వెళ్ళకండి. మా అమ్మాయికి మిమ్మల్ని పరిచయం చెయ్యొద్దూ; మా బిజినెస్‌కు అవసరం అయిన సలహాలు కూడా ఇద్దురుగాని...'

- ఏం జవాబు చెప్పడం ?

ఆయనే అంటున్నాడు :

'అప్పుడు మిమ్మల్ని నేను ఎరగను. దూరం నుంచి చూడడమే. మనం కలుసుకుని మాట్లాడుకునే సందర్భమే రాలేదు. ఎక్కువగా విదేశాలలోనే ఉండేవాడిని కదూ ! నాకు మాత్రం ప్లెజర్ అయినా ఇవ్వరా ?''... దీనంగా గతాన్ని వర్తమానంలోనికి తీసుకు రావడంలోనే కొందరికి ఆనందం. ముందుకు చక చక దూకటానికి పనికి వస్తుందని ఆశ. ఆలోచన. 'ప్రయత్నిస్తానండీ. మీకు ''రింగ్'' చేసి చెబుతాను, ప్రోగ్రాం -' అన్నాడు బలవంతంగా అక్షరాలు కూర్చుకుంటూ, జయవర్ధనం.

'నంబర్ తెలుసుగా!'

తెలుసు. డైరెక్టరీలో ఉన్న ఆ నంబరేగా ఇక్కడకు ఈడ్చుకు వచ్చింది!

సిగరెట్ లైటర్ ఆయనకు ఇవ్వడం సందర్భం కాదు. నిప్పుతో ఏం పని ?

జయవర్ధనం అప్పటికి సెలవు తీసుకుని, షేక్‌హేండ్‌తో పాటు రెండు చేతులతోను నమస్కారం చేశాడు.

మనసు పెలితిగా ఉందో - వరదగా ప్రవహిస్తోందో తెలియడం లేదు.

హోటల్ గదికి చేరుకోవాలి.

దైనందిన వ్యవహారం ప్రారంభం చేయాలి.

ఈ ఉదయం డి. యస్. నరసులు వచ్చేసి, ట్రాక్టర్లు కొంటున్నట్లుగా 'పర్చేజ్ ఆర్డరు' తన చేతికి అందజేస్తే అంతకన్న కావలసిందీ, కోరుకోవలసిందీ ఇంకేం లేదు.

అంతకన్నా జరిగేది కూడా ఇంకేమీ ఉండదు.

✦